క్లుప్తంగా

విజయదుర్గ ఆలయంలో చండీహోమం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక భీమన వారి పేటలో వేంచేసిన శ్రీవిజయదుర్గ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ స్వామికి వివిధ రకాల పండ్లు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆ తరువాత యాగశాలలో జరిగిన చండీహోమంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనుమానంతో భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గొల్లపాలెంగట్టు కస్తూరిబా ఆశ్రమం ప్రాంతంలో బొమ్మిడి అంజలికి 12 ఏళ్ల కిందట వడ్డీకాసులుతో వివాహమైంది. వడ్డీకాసులు ఓ ప్రయివేటు కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా వడ్డీకాసులు భార్య అంజలిని అనుమానంతో వేధింపులకు గురి చేయసాగాడు. దీనిపై పెద్ద మనుషులలో పెట్టి మాట్లాడుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల వడ్డీకాసులు మళ్లీ భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి తీసుకువచ్చేశారు. భర్త వేధింపులపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాత గొడవల నేపథ్యంలో ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడిన ముగ్గురిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నైజాంగేటు ప్రాంతానికి చెందిన పలివెల విజయ్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్న అతనిపై ఇసుకపల్లి నాని, ఇసుకపల్లి రాజీవ్, బాబు వెనుక నుంచి వచ్చి దాడి చేసి గాయపరిచారు. గతంలో ఆ ముగ్గురితో తనకు విభేదాలు ఉన్నట్లు బాధితుడు విజయ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వదంతులను నమ్మవద్దు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని కొంత మంది చేస్తున్న అసత్య ప్రచారాలు, వదంతులను నమ్మవద్దని కొత్తపేట సీఐ చిన్న కొండలరావు వైఎస్సార్ కాలనీ వాసులకు సూచించారు. గురువారం రాత్రి కాలనీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు మైక్ ప్రచారం నిర్వహించారు. కాలనీకి మళ్లీ వరద వస్తుందంటూ ఉదయం నుంచి కొంత మంది పుకార్లు సృష్టించడంతో ఆయన కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ వాహనానికి మైక్ ఏర్పాటు చేసి కాలనీలోని ప్రతి బ్లాక్‌లోని ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించారు. గురువారం సాయంత్రమే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడామని, బుడమేరులో వరద నీరు ప్రస్తుతం గ్రౌండ్ లెవల్‌లోనే ఉందని వారు చెప్పారని వివరించారు. ఎటువంటి ప్రమాదం ఉన్నా ముందుగా ప్రజలకు ప్రభుత్వ శాఖల ద్వారానే తెలియజేస్తామని తెలిపారు.

తల్లిదండ్రులకు యువతి అప్పగింత

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇంటి నుంచి బయటకు వచ్చి విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్న యువతికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కృష్ణలంక పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంనకు చెందిన 16 ఏళ్ల యువతి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు బుధవారం అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ యువతి ఒక యువకుడితో కలిసి విజయవాడ బస్టాండ్‌కు చేరుకొని ఉండవచ్చని అక్కడి పోలీసులు కృష్ణలంక పోలీసులకు సమాచారం ఇచ్చారు. కృష్ణలంక పోలీసులు బస్‌స్టేషన్‌లో గాలింపు చేపట్టి, ఆ యువతి మరో యువకుడితో ఉండడాన్ని గుర్తించారు. వెంటనే వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు విజయవాడ చేరుకున్న తల్లిదండ్రులకు యువతిని, ఏలూరు జిల్లా నుంచి వచ్చిన పోలీసులకు యువకుడిని అప్పగించారు.

అధ్వానంగా రహదారులు

- చిన్నపాటి వర్షం పడినా జలమయం
- రాకపోకలకు స్థానికులకు ఇబ్బందులు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు



హోల్ సేల్ మార్కెట్ ఎదురుగా రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంత



ఐరన్ యార్డుకు వెళ్లే ప్రాంతంలో రోడ్డుపై నీరు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలో కొన్ని ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. కొద్దిపాటి వర్షానికే జలమయం అవుతున్నాయి. వర్షాలకు రోడ్డు మార్జిన్లలో నీరు నిలవడం సహజం. ఇక్కడ మార్జిన్లలోనే కాకుండా ఏకంగా రోడ్డు మధ్యలో నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. అంతర్గత రహదారులే కాదు ప్రధాన రహదారిలో సైతం పలు చోట్ల వర్షపు నీరు నిలుస్తోంది. ఫలితంగా స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపునీరు నిలిచి, వాహనాల తాకిడి కారణంగా తీరుతో నిర్మించిన ప్రధాన రహదారి ధ్వంసమవుతోంది. సితార సెంటర్ నుంచి మైలురాయి సెంటర్ వరకు నాలుగైదు చోట్ల పెద్ద వర్షపు నీరు నిలిచి రోడ్డు దెబ్బతింది. మైలురాయి సెంటర్ నుంచి సితారవైపు వచ్చే మార్గంలో రోజుల తరబడి వర్షపు నీరు నిలబడి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. అక్కడ నుంచి 200 మీటర్ల వరకు వర్షపు నీరు నిలిచి పెద్ద చెరువులా కనిపిస్తోంది. నీరు ఎక్కువగా నిలవడంతో ఆ ప్రదేశంలో వాహనాలన్నీ డివైడర్‌ను ఆనుకుని వెళ్తున్నాయి. ఇక బైక్‌లుపై వచ్చే వారికి ఆ నీటిలో ఎక్కడ గొయ్యి ఉందో అర్థం కాని పరిస్థితి ఉంది. లారీలు, కార్లు వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనదారులు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కార్లు వేగంగా వెళితే పక్కన వెళ్లే వారిపై బురదతో కూడిన నీరు చిందిపడుతోంది. అక్కడ నుంచి ఐరన్ యార్డ్ సమీపంలోకి రాగానే మరో పెద్ద చెరువును తలపిస్తోంది. ఇక్కడ మార్జిన్ పూర్తిగా మునిగిపోయింది. రోడ్డు మధ్యలో వర్షపు నీరు చేరింది. వచ్చే పోయే లారీలతో బురదకయ్యగా మారింది.

ఇరిగేషన్ కార్యాలయానికి దారేది?

ఇరిగేషన్ సెంట్రల్ డిజైన్ ఆఫీసు సమీపంలో లోపలకు వెళ్లేందుకు వీలు లేకుండా నీరు నిలిచింది. వర్షం పడుతుందంటే భయపడే పరిస్థితి నెలకొంది. హెచ్‌బీ కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఖాళీ స్థలాల మాట అటుంచి అంతర్గత రోడ్లే వర్షపు నీటితో మునిగిపోయి అధ్వానంగా మారాయి. దశాబ్దాల కిందట నిర్మించిన తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం వర్షపు నీరు గుంతల్లో చేరి వాగుల్లా కనిపిస్తున్నాయి. భవానీపురం ఎల్ఐసీ ఆఫీసు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డు పొడవునా వర్షపు నీరే. రోడ్డు మచ్చుకు కూడా కనిపించని పరిస్థితి. హోల్ సేల్ మార్కెట్ ఎదురుగా ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ రోడ్డులో నిత్యం వాహనాలు రద్దీ ఉంటుంది. కనీసం ఇక్కడ బారికేడ్ గానీ ఏదైనా సూచికగానీ ఏర్పాటు చేయలేదు. గొయ్యిని పూడ్చే చర్యలు చేపట్టలేదు. రోడ్లు అధ్వానంగా మారినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా సుదీర్ఘ కాలం వర్షపు నీరు నిలిచి రోడ్లు దెబ్బతినడమే కాకుండా పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఎక్కడెక్కడ వర్షపు నీరు నిలుస్తుందో గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. వర్షకాలం వస్తే తమ పరిస్థితి ఇంతే అని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంపై మండిపడుతున్నారు.



భవానీపురం పోలీసు స్టేషన్ ఎదురు రోడ్డులో..



మైలు రాయి నుంచి సితార వైపు వచ్చే దారిలో..



ఎస్ఆర్ఎంటీ ఎదురు రోడ్డులో వర్షపు నీరు



భవానీపురంలో ఎల్ఐసీ ఆఫీసు రోడ్డు ఇలా..

కార్మిక, ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడాలి

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గౌతంరెడ్డి



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని కార్మికులు, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం పాటుపడాలని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీగా నియమితులైన విద్యాధరపురానికి చెందిన సుంకర నారాయణ గురువారం సత్యనారాయణపురంలోని గౌతంరెడ్డి కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సుంకర నారాయణను అభినందించి సత్కరించారు. అనంతరం గౌతంరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మికుల పక్షపాతిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన పాలనలో వాహనమిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఆప్కాస్ విధానాన్ని ప్రవేశపెట్టి వేలాది కార్మికులు, ఉద్యోగులను అందులోకి తీసుకువచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని, మునిసిపల్ వర్కర్లు, ఆశా వర్కర్లు తదితర విభాగాల కార్మికులు, ఉద్యోగులు రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు నిర్వహించడమే అందుకు నిదర్శనమని అన్నారు. సుంకర నారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తిస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు సరగడ శంకర రెడ్డి, బోర మల్లి రెడ్డి, గుండు శ్రీను, దుర్గారెడ్డి, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేశంలోనే ఉత్తమ మరుగుదొడ్లుగా తీర్చిదిద్దాలి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర


పటమట(విజయవాడతూర్పు): నగరంలోని మరుగుదొడ్లను దేశంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యాటనలో భాగంగా ఆయన ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, గవర్నర్ పేట, సీకే రెడ్డి రోడ్డు, అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 70 మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి, ప్రజల అవసరాలకు తగినవిధంగా తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులందరూ నగరంలోని ప్రతి రోడ్డులో పర్యటించి ఎక్కడైనా గుంతలు ఏర్పడితే ఎప్పటికప్పుడు పూడ్చాలని సూచించారు.

రోడ్లు శుభ్రంగా ఉండాలి

నగరంలోని రోడ్లు అన్నింటిని పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సాంబమూర్తి రోడ్డులో ప్రమాదంగా ఉన్న గ్రేటింగ్‌ను గమనించి, తక్షణం మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివైడర్ నుంచి ఫుట్‌పాత్ సహా రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. రోడ్లపై పాత సామగ్రి, కార్లను ఉంచకుండా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచించారు. వంతెనలపై ఏర్పాటుచేసిన మెస్‌లపై పిచ్చి మొక్కలు మొలవకుండా ప్రజారోగ్యం, ఉద్యాన శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. నగరంలో ఉన్న మార్కెట్లు, రైతు బజార్లలో నుంచి వచ్చే వ్యర్థాలకు సంబంధించి చీఫ్ సిటీ ప్లానర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, ఎస్టేట్ ఆఫీసర్లు సమన్వయంతో సంపూర్ణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ప్రబలకుండా మలేరియా సిబ్బంది, యాంటీ మలేరియల్ యాక్టివిటీస్ నిర్వహించాలని చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. ఇంటింటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న విధంగానే, యాంటీ లార్వే పనులు జరగా లని స్పష్టంచేశారు. అనంతరం అజిత్ సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. చెత్త తరలింపునకు మరికొన్ని వాహనాలు ఏర్పాటుచేసి, పేరుకుపోయిన వ్యర్థాలను జిందాల్‌కు పంపించాలని ఆదేశించారు.

పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన చరిత్ర మారదు

ప్రముఖ జీవశాస్త్రవేత్త డాక్టర్ దేవరాజు మహారాజు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ దేవరాజు మహారాజు

కృష్ణలంక(విజయవాడతూర్పు): హిందూ జాతీయవాదానికి అనుగుణంగా పాఠశాలల్లో పాఠ్యాంశాలను మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రముఖ జీవశాస్త్రవేత్త, కవిరాజు త్రిపురనేని జాతీయ పురస్కార తొలి గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. పాఠ్యాంశాలను మార్చినంత మాత్రాన సైన్సు, చరిత్ర మారవన్నారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త ఎస్.ఆర్.పరిమి అధ్యక్షతన 'సైన్స్, చరిత్ర పాఠ్యాంశాల్లో మార్పులు' అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి దేవరాజు మహారాజు మాట్లాడుతూ.. సమాజగతిని మార్చగల శక్తి సామర్థ్యాలు సమాజంలో ఎప్పుడైనా ఏ కొద్ది మందికో ఉంటాయన్నారు. ఆ కొద్ది మంది తయారు కావడానికి ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాలన్నారు. పాఠ్య పుస్తకాల్లో అవసరమైన అంశాలు తొలగించడమంటే నిజాలను తొక్కిపెట్టడం, సమాజాన్ని నిస్సత్తువగా మార్చడమేనని అభిప్రాయం వ్యక్తంచేశారు. నిజాల్ని దాచిపెట్టి హిందుత్వ అజెండాను తీసుకొచ్చి సృష్టి సిద్ధాంతాన్ని బాలబాలికల మెదళ్లలో కూర్చి, రాజ్యాంగాన్ని పక్కకు తోసి మనుస్మృతిని వాడుకలోకి తేవాలన్నదే ఆర్ఎస్ఎస్, బీజేపీ ఉద్దేశమన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పాఠశాల పాఠ్యగ్రంథాల నుంచి సైన్సు, చరిత్రకు సంబంధించి పలు అంశాలను తొలగించిందన్నారు. నిజానికి అవి చాలా ముఖ్యమైన అంశాలన్నారు. జీవ పరిణామాన్ని విజ్ఞాన శాస్త్ర సిలబస్‌లో లేకుండా చేయడం అన్యాయమన్నారు. చరిత్ర పాఠ్య పుస్తకాల నుంచి 400 సంవత్సరాలు పరిపాలన చేసిన మొఘలుల పాలనా కాలాన్ని తొలగించడం, వారి విద్వేష పాలసీ విధానానికి అనుగుణంగా చేసిందేనని పేర్కొన్నారు. పాఠ్యగ్రంథాల సిలబస్‌లు మార్చుకున్నంత మాత్రాన అసలు చరిత్ర మారదు కదా, చారిత్రక ఆనవాళ్లు తుడిచి పెట్టుకుపోవు కదా అని ప్రశ్నించారు. ఆర్కియాలజీ విభాగం రిపోర్టులు, ప్రపంచ వ్యాప్తంగా వందల మంది చరిత్రకారులు రాసిన చరిత్ర గ్రంథాలు మాట్లాడుతూనే ఉంటాయన్నారు. ఈ సదస్సులో ఎంబీ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పి.మురళీకృష్ణ, పరిమి మేడసాని సుభాకర్ తదితరులు మాట్లాడారు.

బాలికను అమ్మమ్మ చెంతకు చేర్చిన పోలీసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పెనమలూరు మండలం కానూరులోని హాస్టల్ నుంచి తప్పించుకున్న బాలికను కృష్ణలంక పోలీసులు క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. కానూరులోని నవజీవన్ హాస్టల్‌లో ఉంటున్న 11 సంవత్సరాల బాలిక గురువారం ఉదయం హాస్టల్‌లో ఎవరికీ చెప్పకుండా తప్పించుకుని బయటకు వచ్చింది. నడుచుకుంటూ స్క్యూబ్రిడ్జి వద్దకు చేరుకుంది. ఎటు వెళ్లాలో తెలియక బిక్కుబిక్కుమంటూ అక్కడే ఉన్న బాలికను గమనించిన ఒక సెక్యూరిటీ గార్డ్ కృష్ణలంక పోలీసులకు అప్పజెప్పాడు. బాలిక నుంచి వివరాలు సేకరించిన పోలీసులు బాలిక అమ్మమ్మ కొత్తపేట వాగుసెంటర్‌లో ఉంటున్నట్లు తెలుసుకుని ఆమెకు సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా బాలికను అప్పగించారు.

మహిళా విద్యతోనే సామాజిక వికాసం : డీసీపీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళా విద్యతోనే సామాజిక వికాసం సాధ్యమని డీసీపీ కె.జి.వి.సరిత అన్నారు. నగరంలోని గాంధీజీ మహిళా కళాశాల 35వ వ్యవస్థాపక దినోత్సవం కళాశాల ప్రాంగణంలో గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సరిత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళా విద్య కోసం పాతబస్తీలో కళాశాలను స్థాపించి 35 సంవత్సరాలుగా కొనసాగించటం అభినందనీయమన్నారు. విద్యార్థినులు తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సి.ఎల్.కాంతారావు మాట్లాడుతూ.. కళాశాల ప్రస్థానాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సహకారంతో వెయ్యి మంది పేదలకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు కె.వి.పిచ్చయ్య, ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్‌కు సత్కారం



మేయర్ భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న వన్ ఎర్త్ - వన్ లైఫ్ ప్రతినిధులు



ధ్యానచంద్రను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ద్వారా నగరానికి ప్రతిష్టాత్మకమైన అవార్డుల సాధనకు కృషి చేసిన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ధ్యాన్‌చంద్రను సత్కరించారు. పర్యావరణ సేవా సంస్థ 'వన్ ఎర్త్ - వన్ లైఫ్' ప్రతినిధులు గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని వారి వారి చాంబర్‌లకు వెళ్లి మేయర్, కమిషనర్‌ను అభినందించి దుశ్శాలువాతో సత్కరించారు. స్వచ్ఛత విషయంలో అధికారులు, కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషితో స్వచ్ఛత సూపర్‌లీగ్ సిటీ, గార్బేజ్ ఫ్రీ సిటీ అవార్డులను దక్కించుకుని విజయవాడ నగరాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణకు తమ సంస్థ కృషి చేస్తోందని మేయర్, కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో 'వన్ ఎర్త్ - వన్ లైఫ్' గ్రూప్ అడ్మిన్లు లీలాకుమారి ఏలూరి, అరికెపూడి సురేష్, కో అడ్మిన్లు నాగలక్ష్మి, పాలడుగు సురేష్, మద్దిరాల కమలాకరరావు, వీర వనిత, కృష్ణవేణి, సరిత, హారతి, మాధవీలత పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌కు సత్కారం

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో సూపర్ స్వచ్ఛత లీగ్ సిటీ, గార్బేజ్ ఫ్రీ సిటీలో 7 స్టార్ రేటింగ్ సాధించడానికి కృషి చేసిన మునిసిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్రను లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత సభ్యులు నగరంలోని ఆయన చాంబర్‌లో కలిసి గురువారం సత్కరించారు. లయన్స్ క్లబ్ రీజనల్ కౌన్సిల్ చైర్మన్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్, సభ్యులు వెంకటేశ్వరరావు, కోట శ్రీనివాసరావు, అంకాల సత్యనారాయణ, ముస్తాఫా, బోడి ఆంజనేయరాజు, రామకృష్ణ, కిరణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భవిష్యత్తులో నగరానికి మరిన్ని అవార్డులు తీసుకురావాల్సిందిగా క్లబ్ సభ్యులు కోరారు.





మొరాయించిన ఆర్టీసీ అద్దెబస్సు

పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి గురువారం ఉదయం 10.30 గంటలకు ఆర్టీసీ అద్దె బస్సు ఒకటి నాన్ స్టాప్ సర్వీస్‌గా ఏలూరు బయలు దేరింది. రామవరప్పాడు రింగ్ సమీపంలోకి రాగానే బస్సు కదలనని మొరాయించింది. బస్సు ఎందుకు ఆగిందో డ్రైవర్ లక్ష్మణరావుకు అర్థం కాలేదు. చేసేదేమీ లేక బస్సులో ఉన్న 20 మంది ప్రయాణికులను మరో బస్సు ఎక్కించారు. అనంతరం డ్రైవర్ మరోసారి బస్సును క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను తెలుసుకున్నారు. బ్యాటరీ నుంచి ఇంజిన్‌కు ఉండే ఫ్యూజు దెబ్బతిందని గుర్తించారు. కొత్త ఫ్యూజు వేయడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఏలూరు నుంచి ప్రైవేట్ మెకానిక్ వచ్చి సమస్యను పరిష్కరించే వరకు బస్సు అక్కడే నిలిచిపోయింది. ఇలా ఆర్టీసీ అద్దెబస్సులు తరుచూ మొరాయిస్తున్నాయని ప్రయాణికులు పేర్కొన్నారు.

- ఆటోనగర్(విజయవాడతూర్పు)

మలేరియా ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ మలేరియా సెక్షన్‌లో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్‌గా పని చేస్తున్న ధారావత్ రవిచంద్ర సూర్యకుమార్(48) అదృశ్యంపై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధారావత్ రవిచంద్ర సూర్యకుమార్, సుబ్బలక్ష్మి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అజిత్‌సింగ్‌నగర్ ఇందిరానాయక్ నగర్‌లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో రవిచంద్ర సూర్యకుమార్ బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఆఫీస్‌కు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి ఏడు గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. గురువారం కూడా ఇంటికి చేరుకోకపోవడంతో భార్య సుబ్బలక్ష్మి బందరు రోడ్డులోని జిల్లా మలేరియా ఆఫీస్‌కు వెళ్లి విచారించగా రవిచంద్ర సూర్యకుమార్ బుధవారం సాయంత్రం ఆఫీస్‌కే రాలేదని తెలిపారు. దాంతో ఆమె బంధువుల ఇళ్లల్లో, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో వెతికింది. అయినా అతని ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





దుర్గగుడి ఘాట్ రోడ్డుకు తాళాలు

కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దుర్గగుడి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. కొండ చరియలు విరిగి పడే ప్రమాదం ఉండటంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తగా ఈ చర్య తీసుకున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ